క్లుప్తంగా

విద్యుత్ పునరుద్ధరణ

కరకగూడెం: మండల వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా తుఫాన్ ప్రభావంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, మరికొన్ని వాలిపోయి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కరకగూడెం ఏఈ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నుంచి విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయగా వంగిన స్తంభాలను సరిచేసి శనివారం సాయంత్రం వరకు విద్యుత్‌ను అందించే ప్రయత్నం చేశారు. అలాగే ఎక్కడైన విద్యుత్ తీగలు తెగిపోయినట్లు కనిపిస్తే వాటి వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఆ సమాచారాన్ని విద్యుత్ శాఖ నంబర్ 7382633853కు అందించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

మణుగూరురూరల్: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గెలుపొందిన మేదర మెట్ల శ్రీనివాసరావు, చిర్రా రవికుమార్‌లను శనివారం పార్టీ కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. టీడీపీ నాయకులు వట్టం నారాయణదొర, వాసిరెడ్డి చలపతిరావు, సర్పంచ్ బచ్చల భారతి, మల్లిడి లోకేశ్వరరావు, యలపాటి పూర్ణచందర్‌రావు, ఖమురున్నీసా బేగం, యార్లగడ్డ రాజా, మానుకొండ రఘురాం, భద్రయ్య, పి.సుధాకర్, అశోక్, పవన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ పోలీసులు ఓ యువకుడి అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేశారు. భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన అరుణ్.. చదువు పూర్తి చేసిన ఉద్యోగం రావడం లేదనే మనోవేదనతో గత నెల 31న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధుల ఇళ్ల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న ఆత్మీయ సమ్మేళనం

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ఈ నెల 6న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మెచ్చానాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ సవలం రాణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భూపతి నరసింహారావు, భారత రాంబాబు, జంగాల ఉమ, చల్లా రాంబాబు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

మణుగూరుటౌన్: వేసవి నేపథ్యంలో మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీలోని పీకేఓసీ–2లో ఉద్యోగులు, కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం గని మేనేజర్ మాలోత్ రాముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం తీర్చాలనే ఉద్దేశంతో సింగరేణి సంస్థ ప్రతి ఏటా మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీకేఓసీ–2 ఎస్‌ఓఎం రాంబాబు, ఎం.లింగబాబు, జి.శంకర్, ఇంజనీర్లు రాజశేఖర్, శ్రీనివాస్, పి.సాయినాథ్, సీనియర్ పీఓ ఎండీ.మదార్‌సాహెబ్, గుర్తింపు సంఘం నాయకులు చిట్టి వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్ అశోక్, కాంతారావులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

దమ్మపేట: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు.. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శనివారం దమ్మపేట మండల కేంద్రంలోని ఏటీడీఓ కార్యాలయంలో, ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సీఎం, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు, 12 నెలలకు వేతనాలను ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాంబాబు, నాగేశ్వరరావు, పాంచాలి, సునీత, రజనీ తదితరులు పాల్గొన్నారు.

విప్ కాంతారావును కలిసిన నాయకులు

అశ్వాపురం: ఇటీవల అనారోగ్యానికి గురై కరకగూడెంలో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు శనివారం కలిశారు. రేగా కాంతారావు ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మట్టపల్లి సాగర్ యాదవ్, మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, బూర్గంపాడు టౌన్ అధ్యక్షుడు కన్నెపల్లి సతీష్, అశ్వాపురం గ్రామ అధ్యక్షుడు కిరణ్, నజీర్‌షాను పాల్గొన్నారు.

కూల్ కూల్‌గా రోగాలు!

- వేసవి పానీయాలతో ప్రమాదం
- నాసిరకం ఐస్‌క్రీమ్‌లతో అనారోగ్యం
- స్వచ్ఛత లోపించడం వల్లే ఇబ్బందులు..
- పట్టించుకోని సంబంధిత అధికారులు



లోకల్ ఐస్‌తో తయారు చేసిన కలర్ సోడాలు



నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తయారు చేస్తున్న కూల్‌డ్రింక్స్

భద్రాచలంటౌన్: రోజురోజుకూ ఎండలు పెరిగిపోవడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 10 గంటలు దాటితే చాలు ఎండలు భగభగ మండుతున్నాయి. గత రెండు రోజుల నుంచి ఉదయంతో మొదలు సాయంత్రం వరకు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. వివిధ పనులపై బయట తిరిగే వాహనదారులు, ప్రజలు ఎండ తాపానికి కూల్‌డ్రింక్‌లు తాగుతుంటారు.

ఈ క్రమంలో అందుబాటులో ఉండే చల్లని పదార్థాలు ఏది పడితే దాన్ని తాగితే అనారోగ్యం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకుని కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లను నాసిరకంగా తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అపరిశుభ్రంగా ఉండే నీటితో ఐస్‌లను తయారుచేస్తున్నారు. ఇదే ఐసును చెరుకురసం, లస్సీ, మజ్జిగ తదితర కూల్ పదార్థాలలో వినియోగిస్తున్నారు. వేసవి సీజన్ ముగిశాక మాయమయ్యే ఈ వ్యాపారుల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోరు. ఆహార నియంత్రణ శాఖ అధికారులు అనుమతులు తీసుకోవాలని సూచించరు. కనీసం ప్రమాణాలు పాటించాలని సైతం సూచనలు చేయడం లేదు. ఫలితంగా వ్యాపారులలో కొందరు నాసిరకం కూల్‌డ్రింక్స్ తయారు చేసి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలియక వీటిని తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

వేసవి పానీయాలతో వచ్చే వ్యాధులివే..

చల్లని కూల్‌డ్రింక్స్ తాగే ముందు అస్తమా, బ్రాంకైటిస్, ఇస్నోఫీలియా బాధితులు అప్రమత్తంగా ఉండాలి. బాగా చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులలోని గాలిని తీసుకెళ్లే ట్యూబ్‌లు పూర్తిగా మూసుకుపోయి శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇంట్లోని ఫ్రిజ్‌లో ఉన్న పదార్థాల జోలికి సైతం వెళ్లకుంటే మంచిది. చిన్న పిల్లలు, వృద్ధులు అదే పనిగా చల్లని ద్రవాలు, రోడ్డు పక్కన దొరేకేవి తీసుకోవడం వల్లన అనేక వ్యాధులు కొనితెచ్చుకున్నట్లే. సరైన ఐస్‌ను ఉపయోగించకపోవడం ఒక కారణమైతే వీటిని అమ్మేవారు శుభ్రత పాటించకపోవడం, రోడ్డుపై దుమ్ము, తూళి వీటిపై పడటం మరో కారణం. తొలుత గొంతునొప్పితో సమస్య ప్రారంభమై తర్వాత గొంతు బొంగురుపోవడం దగ్గు, జలుబుతో పాటు తీవ్ర జ్వరం వస్తుంది. చిన్న పిల్లలలో దీర్ఘకాలిక దగ్గు, పొడిదగ్గు, ఆయాసం, ఛాతీ బిగుసుపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.

శుద్ధి చేయని నీటితోనూ ఇబ్బందులు..

స్థానికంగా శుద్ధిచేయని నీటితో తయారైన కూల్ డ్రింక్స్ వల్ల నీటి ద్వారా సంక్రమించే వాధులు వైరల్ ఫీవర్, హెపటైటిస్, డయేరియా, టైఫాయిడ్ జ్వరంతో పాటు కొన్నిరకాల బాక్టీరియా జబ్బులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇందులో పచ్చకామెర్లు ప్రమాదకరమని, కాచి చల్లార్చిన నీటితో డ్రింక్స్ తయారు చేయాలని, సరిగ్గా నీటిని శుద్ధి చేయకుండా తాగుకూడదని, రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు వెల్లడిస్తున్నారు.

పిల్లలకు దూరంగా ఉంచాలి



వేసవి కాలంలో కూల్‌డ్రింక్స్, చల్లటి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. బాలింతలకు సైతం చల్లటి పదార్థలను పెట్టకూడదు. నాసిరకం ఐస్‌క్రిమ్స్, కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. సాధ్యమైనంత వరకు ఇంట్లో సొంతంగా తయారు చేసుకున్న మొతాదుకు సరిపడే చల్లటి పదార్థాలను తీసుకోవాలి. నాణ్యత ప్రమాణాలు పాటించని చోట చల్లటి పదార్థాలు తీసుకోవడం తల్లి, పిల్లలకు అనారోగ్యానికి కారణమవుతాయి.

– డాక్టర్ చైతన్య,
మథర్ అండ్ చైల్డ్ హెల్త్ జిల్లా అధికారి

సాంబాయిగూడెంలో ఎంపీపీ పర్యటన



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ విజయకుమారి

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి శనివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆమె వీధి వీధిన తిరుగుతూ.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీపీ విజయకుమారి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన ఆమె.. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటుమియా, వార్డ్ సభ్యులు పి.రమేష్, చిడెం నాగేశ్వరరావు, అన్నమనేని రాజేశ్వరరావు, గ్రామస్తులు బి.వీరన్న, సతీష్, అఖిల్, కాజామియా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మన ఊరు–మన సర్పంచ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నుంచి సర్పంచ్ మల్లారెడ్డి గ్రామంలో వీధి వీధినా తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అధికారులతో మాట్లాడి పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. బీజీకొత్తూరు గ్రామంలో వడగండ్ల వానతో దెబ్బతిన్న వరిపొలాలను రైతులతో కలిసి సర్పంచ్ పరిశీలించారు. వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు వర్తింపజేయాలని రైతుల పక్షాన ఆయన కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.1 కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపామన్నారు. దశల వారిగా సీసీ రోడ్ల నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందామని భవిష్యత్తులో పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ మల్లారెడ్డి

సీసీ రోడ్డు నాణ్యతపై ఆందోళన

దమ్మపేట: ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంపై స్థానికులు ఆందోళన నిర్వహించిన సంఘటన దమ్మపేట మండల కేంద్రంలోని బంజారా కాలనీలో చోటు చేసుకుంది. శనివారం మండల కేంద్రంలోని జంజారా కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో మట్టితో కూడిన ఎర్ర ఇసుకను వాడటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లోపం పట్ల పలుమార్లు హెచ్చరించనప్పటికీ, కాంట్రాక్టరు తీరు మార్చకపోవడంతో విసుగు చెందిన స్థానికులు నిర్మాణ పనులను అడ్డగించారు.

స్థానికుల ఆందోళనను విరమింపజేయాలని ప్రయత్నించిన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులపై కూడా ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేయడమే కాక, ప్రశ్నలతో నిలదీశారు. దీనితో చేసేదేమి లేక బీఆర్‌ఎస్ నాయకులు వెనుతిరిగారు. నాణ్యమైన ఇసుకను తెచ్చేవరకు నిర్మాణ పనులను కొనసాగించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించబోమని స్థానికులు స్పష్టం చేశారు.

‘బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం’



ఆందోళన చేస్తున్న ఏజే రమేష్, ఇతర సీపీఎం నాయకులు

బూర్గంపాడు: కార్మిక చైతన్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ మెయిన్ గేట్ వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఐదు లక్షల మందితో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రజా సంపదను దోచిపెడుతోందని అన్నారు. సంపదను సృష్టించే రైతులను, కార్మికులను, వ్యవసాయ కార్మికులను ఘోరంగా మోసగిస్తోందన్నారు. ప్రజల మధ్య అంతరాలను సృష్టించి పేద, మధ్యతరగతి ప్రజలను మరింత పేదరికంలోకి నెడుతోందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, బర్ల తిరుపతయ్య, బత్తుల గోపాలరావు, చంద్రశేఖర్, ఆరోన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ, అయన్నపాలెం గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో మండల ఏఈ నర్సింహారావు శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. 11/33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపాలున్నట్లు, వాటి మరమ్మతుల నిమిత్తం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు పొంగులేటి పర్యటన

భద్రాచలం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాచలం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆయన క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా వాజేడు, వెంకటాపురం, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించనున్నారని పేర్కొన్నారు. పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరు కానున్నారని తెలియజేస్తూ.. పర్యటనను విజయవంతో చేయాలని ఆయన కోరారు.

వైద్యశిబిరం విజయవంతం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో మమత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత దంతవైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ కుక్కడపు లిఖిత వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, కుక్కడపు హరిబాబు, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు, మెడా మోహన్‌రావు, గాదె శివప్రసాద్, ఎస్.వెంకటనారాయణ, భూపతి రమేష్, వి.బాబురావు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపి

మణుగూరురూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మణుగూరుకు చెందిన గురిజాల గోపిని నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఈమేరకు ఆయన నియామకపత్రాన్ని గురిజాల గోపికి అందజేశారు. ఈ సందర్భంగా గురిజాల గోపి మాట్లాడుతూ.. కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం యువజన జిల్లా ఉపాధ్యక్షుడు బండి శ్రీకాంత్, పసుపులేటి వీరబాబు, అమరబాబు, పవన్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిరుధాన్యాల పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గర్భిణులకు సీమంతాలు అన్నప్రాసన వేడుకలను ఐసీడీఎస్ సీడీపీఓ సలోమి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరియం రాజమ్మ, సూపర్‌వైజర్ షహానా సుల్తానా, ఏపీఓ సుకన్య, ఏఎన్‌ఎం లీలాకుమారి అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, జయలక్ష్మి, నాగలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

ఇతరుల పెత్తనాన్ని సహించం



సమావేశంలో మాట్లాడుతున్న చందా సంతోష్

మణుగూరుటౌన్: ఇతర నియోజకవర్గం వారు పినపాకకు వచ్చి పెత్తనం చేస్తే సహించేది లేదని పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మణుగూరులో శనివారం నాయకులు చందా సంతోష్, కాటిబోయిన నాగేశ్వరరావు, బట్టా విజయ్‌గాంధీ, శ్రీవాణి మాట్లాడారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క కుమారుడు సూర్యం పినపాక నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలకు పాల్పడడం సరికాదన్నారు. స్థానికులకు మాత్రమే పినపాక టికెట్ ఇవ్వాలని తాము అధిష్టానాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సూర్యం తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీర్షాకి నవీన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఇక్బాల్ హుస్సేన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి..

అశ్వారావుపేటరూరల్: తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని, తప్పుడు ప్రచారం చేయవద్దని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గడిచిన నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, మంజూరు చేయించిన నిధులు, సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కలిపి ఎన్నడూ లేని విధంగా రైతుబంధు పథకం ద్వారా మూడు లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.527కోట్ల 34లక్షల 20వేల 694 రూపాయాలు ఇప్పటి వరకు జమ చేయగా, రైతు బీమా ద్వారా ఐదు మండలాల్లో కలిపి 740 మంది రైతులు మృతి చెందగా, ఒకొక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.37కోట్ల రూపాయాలు బాధిత కుటుంబీకులకు అందించామన్నారు. నియోజకవర్గానికి 1380 డబుల్ ఇళ్లు మంజూరు కాగా 959 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగించామని, మిగిలిన 211 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. వీటితోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 3,533 మంది లబ్దిదారులకు రూ.49కోట్ల 33లక్షల 52వేల 796 రూపాయాల చెక్కులను పంపిణీ చేసినట్లు, దళిత బంధు ద్వారా 100 మంది లబ్దిదారులకు రూ.10కోట్లు అందించినట్లు తెలిపారు. ఇవే కాకుండా బీసీ, మైనార్టీ ఇతర కార్పోరేషన్‌ల ద్వారా రుణాలు, ఆసరా ఫించన్లు, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, ఉపాధి హామి పథకం కింద రహదారుల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. తాజాగా అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్ కోసం రూ.23కోట్ల 50లక్షలతో పాటు, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట మండలాలకు 10 కోట్లు, ములకలపల్లి మండలానికి రూ.5కోట్ల75లక్షలు మంజూరు చేయించగా, ఇవీ టెండర్ దశల్లో ఉన్నట్లు వివరించారు. అంతేకాకుండా అశ్వారావుపేటలో ఎస్టీవో, ఆర్‌టీఏ కార్యాలయాలను ఏర్పాటు చేయించామని, వచ్చే జూన్ నుంచి డిగ్రీ కళాశాల ప్రారంభిస్తామన్నారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దమ్మపేట జడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరావు, బీఆర్‌ఎస్ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సంపూర్ణ, వెంకన్న పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేస్తున్న వైద్యులు స్పందన, శివరామకృష్ణ ప్రసాద్‌లు

భద్రాచలం: గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఓ పేదింటి మెరిట్ అభ్యర్థినికి పట్టణానికి చెందిన ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం స్పందించి ఆర్థిక సాయం శనివారం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శాంతి నగర్ కాలనీకు చెందిన బాసిపోగు భవానీ దివ్యాంగురాలు. అయినప్పటికీ పట్టుదలతో దాతల సహాయంతో గ్రూపు–1 ప్రిలిమనరీలో ఉత్తీర్ణురాలై మెయిన్స్‌కు ఉత్తీర్ణత సాధించింది. అయితే ఇటీవల పేపర్ లీకేజీలతో ఆ పరీక్షలను రద్దు చేయటంతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. దీంతో ఆర్థిక సమస్యలను తెలుసుకున్న పట్టణంలోని జీవన్ ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ చల్లగుళ్ల స్పందన, డాక్టర్ శివరామకృష్ణప్రసాద్, టీఎన్‌జీవోఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరావులు రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. నగదుతోపాటు నిత్యావసరాలను ఆమెకు అందజేశారు.

బీఆర్‌టీయూ బలోపేతానికి సహకారమందించండి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో బీఆర్‌ఎస్ అనుబంధ బీఆర్‌టీయూను బలోపేతం చేసేందుకు సహకరించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిని యూనియన్ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలసి బీఆర్‌టీయూ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి సహకారమందించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి మల్లారెడ్డిని ఘనంగా సత్కరించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై పర్యవేక్షణ జరగాలని, మిషన్ భగీరథ నీటి సమస్యలకు పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం మణుగూరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల నియోజకవర్గానికి నిధులు మంజూరైనట్లు రేగా ద్వారా తెలియవచ్చిందని, ఆ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. 15 రోజులుగా నియోజకవర్గంలో మిషన్‌భగీరథ నీరు నామమాత్రంగా సరఫరా చేస్తున్నారని, సమస్య లేకుండా సంపూర్తిగా సరఫరా చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, గద్దల శ్రీనివాసరావు, కోడిశాల రాములు, పాయం నర్సింహారావు, బత్తుల వెంకటేశ్వర్లు, కాంతారావు, సాంబశివరావులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు వితరణ

అశ్వారావుపేటరూరల్: యువ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వితరణ అందించారు. మండల పరిధిలోని నారాయణపురం, గుమ్మడవల్లి, మామిళ్లవారిగూడెం గ్రామాల్లో ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హలవత్ హరిబాబు, తాటి శ్రీనివాస్, సేవా సమితి బాధ్యులు తాళ్లూరి నాగమురళి, గోసుల వంశీ, డేరంగుల రామకృష్ణ, త్రిమూర్తి, రాజు, ఖలీద్, ప్రసాద్, నాగరాజు, నవీన్, వీర్రాజు పాల్గొన్నారు.

బూర్గంపాడు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బూర్గంపాడు ఏఎస్సై వైవీపీ సత్యనారాయణ ఆకాంక్షించారు. బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఆయన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్స్‌లను అందించారు. విద్యార్థులు ఉత్తమ మార్కులను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏఎస్సైను ప్రధానోపాధ్యాయులు జాన్సన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

ములకలపల్లి: పాల్వంచకు చెందిన వేచన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీలు, పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను వితరణగా అందజేశారు. మండలపరిధిలోని తిమ్మంపేట స్కూల్ హెచ్ఎం శంకర్ కుమారుడు వేచన్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడగా.. చిన్నారి సంస్మరణార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండలపరిధిలోని పూసుగూడెం జీపీలోని పకీర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు 30 కుర్చీలను అందజేశారు. అదేవిధంగా పొగళ్లపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయశంకర్ తెలిపారు.

మామిడి రైతు విలవిల



గాలిదుమారానికి నేలరాలిన మామిడికాయలు.

చంద్రుగొండ: ప్రకృతి వైపరిత్యాలు మామిడిరైతుల పాలిట శాపంగా పరిణమించాయి. ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా శుక్రవారం రాత్రి మండలంలో కురిసిన వర్షం, గాలిదుమారంతో మామిడిరైతులు విలవిల్లాడిపోయారు. చేతికొచ్చిన పంట రాలిపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయారు. చంద్రుగొండ, దారమచర్ల, రావికంపాడు, మద్దుకూరు, పోకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో మామిడిపంట విస్తరించి ఉంది. ప్రతిఏటా ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంటనష్టం జరుగుతూనే ఉంది. ఈ యేట కూడా ప్రకృతి విడిచిపెట్టలేదు. గాలివాన బీభత్సానికి తీవ్ర స్థాయిలో మామిడి రైతులు నష్టపోయారు. ఉదాహరణకు.. రావికంపాడులో చంద్రుగొండకు చెందిన కొడకండ్ల నాగేశ్వర్‌రెడ్డికి 10 ఎకరాల మామిడితోట ఉంది. అరకొరగా పండినపంట చేతికందే దశలో ఉండగా గాలిదుమారంతో కూడిన వర్షం కారణంగా పంటంతా నేలపాలైంది. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు నాగేశ్‌రెడ్డి చెబుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇలా ఎందరో రైతులు నష్టపోయి ప్రభుత్వ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.